సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 5 । మార్చి । 2024



త్వరలో షాపింగ్ కాంప్లెక్స్..

మున్సిపల్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి తెలిపారు. 8లో▸



గెలుపే లక్ష్యంగా పనిచేయండి

ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేంనరేందర్ రెడ్డిని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కలిశారు. 8లో▸



విద్యార్థులకు శిక్షణ

రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. 8లో▸

న్యూస్‌రీల్

బతికున్న రైతు పేరిట డెత్ సర్టిఫికెట్

- ఇతరులకు భూమి విరాసత్
- లబోదిబోమంటున్న బాధితుడు



పట్టాదారు పాసుపుస్తకం చూపిస్తున్న రైతు

కొందుర్గు: ఓ రైతు బతికుండగానే మరణించినట్లు ధ్రువీకరించి సదరు ఇతని భూమిని ఇతరుల పేర్లపై పట్టామార్పిడి చేసిన సంఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరన్నపేటలో చోటుచేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం గడ్డం వెంకటయ్యకు శేగిరెడ్డిగణపూర్ శివారులోని 16/26/ అ2 సర్వేనంబర్‌లో 10 గుంటలు, 222/3లో 20 గుంటల భూమి ఉంది. ఇందులో పంటలు సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈయనకు మల్లేశ్, నర్సింలు ఇద్దరు కొడుకులతో పాటు మరో కూతురు ఉంది. అయితే రైతు వెంకటయ్య మరణించినట్లు ధ్రువీకరణ పత్రాన్ని జతచేసి.. 30 గుంటల భూమిని ఇదే వీరన్నపేటకు చెందిన తిమ్మగళ్ల గాయత్రి, హన్మగళ్ల మమత పేర్లపై అధికారులు విరాసత్, పట్టా మార్పిడి చేశారు.

రైతుబంధు రాలేదని..

వెంకటయ్యకు ముప్పై గుంటలే భూమే ఆధారం. రైతుబంధు రాకపోవడంతో అనుమానం వచ్చి ఆన్‌లైన్‌లో చూడటంతో అసలు సంగతి బయటపడింది. ఈ విషయమై పలుమార్లు రెవెన్యూ అధికారులను ఆశ్రయించినా తనకు న్యాయం చేయలేదని బాధితుడు వాపోయాడు. ఈ విషయమై అడిగేందుకు తహసీల్దార్‌కు జగదీశ్వర్‌కు ఫోన్ చేయగా స్పందించలేదు.

ఆదిబట్ల చైర్మన్‌గిరిపై హైకోర్టులో వాదనలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ నియామక అంశం హైకోర్టుకు చేరింది. ఫిబ్రవరి 9న ప్రత్యేక సమావేశం నిర్వహించి అవిశ్వాసం ద్వారా చైర్మన్, వైస్ చైర్మన్‌ను తొలగించిన విషయం తెలిసిందే. కలెక్టర్ ఈ విషయంపై స్పందించి చైర్మన్, వైస్ చైర్మన్‌ను నియమించడానికి సమయం ఇవ్వాలి. కానీ రాజకీయ ఒత్తిడి కారణంగా నోటిఫికేషన్ వెలువడడం లేదు. దీంతో వారం రోజుల క్రితం చైర్మన్ పదవి ఆశిస్తున్న మర్రి నిరంజన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. సోమవారం హైకోర్టులో ఆయన తరుపున న్యాయవాది కేవీ కృష్ణమూర్తి వాదనలు వినిపించారు. దీంతో న్యాయమూర్తి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు న్యాయవాది తెలిపారు. చైర్మన్, వైస్ చైర్మన్ లేకుండా పాలన ఎలా సాగుతుందని.. ఎందుకు నోటిఫికేషన్ జారీ చేయడం లేదని ప్రశ్నించినట్లు చెప్పారు. ఎన్నికల అధికారులు, కలెక్టర్ ఈ నెల 18వ తేదీలోపు స్పందించాలని, లేదంటే తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

హెచ్‌పీఎస్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నంరూరల్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ శశాంక సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లంబాడ -4, ఎరుకల -1, ఇతర గిరిజన తెగలకు -1 మొత్తం ఆరు సీట్లకుగాను బాలురు -4, బాలికలు -2 సీట్లు ఉన్నట్టు తెలిపారు. అభ్యర్థులు జిల్లా వారై ఉండాలని, తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించరాదని సూచించారు. కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. అభ్యర్థి 01.07.2017 నుంచి 2018 మధ్యకాలంలో పుట్టి ఉండాలని తెలిపారు. ఈనెల 11 చివరి తేదీ అని పేర్కొన్నారు. 14వ తేదీ సాయంత్రం 4 గంటలకు లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారన్నారు.

పట్టా.. మారిందెట్టా?

పట్టాగా మారిన లావణి భూములు

- రైతులను మభ్యపెట్టి బడాబాబులకు కట్టబెట్టిన వైనం
- చేతులు మారిన సుమారు రూ.వంద కోట్ల విలువైన భూమి
- ధరణి లొసుగులతో 25 ఎకరాలు రిజిస్ట్రేషన్
- తహసీల్దార్‌కు గ్రామస్తుల ఫిర్యాదు



మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న తోలుకట్ట గ్రామస్తులు

మొయినాబాద్: జిల్లాలో భూ కబ్జాల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. ధరణి పోర్టల్‌లోని లొసుగులతో లావణి భూములను సైతం పట్టా భూములుగా మార్చి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీంతో సుమారు రూ.వంద కోట్ల విలువ చేసే 25 ఎకరాల లావణి భూమి చేతులు మారిపోయింది. మొయినాబాద్ మండలం తోలుకట్ట రెవెన్యూ లోని సర్వేనంబర్ 107లో 12.14 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని ప్రభుత్వం అరుగురు రైతులకు అసైన్డ్ చేసి లావణి పట్టాలు ఇచ్చింది. సర్వేనంబర్ 85లో 16.24 ఎరాల ప్రభుత్వ భూమి ఉండగా నలుగురు రైతులకు 16 ఎకరాలను అసైన్డ్ చేసి లావణి పట్టాలు ఇచ్చింది. 24 గుంటలు ప్రభుత్వ భూమిగానే కొనసాగుతోంది.

ఆశచూపి.. అగ్గువకు కొని

తోలుకట్ట రెవెన్యూలోని సర్వేనంబర్లు 85, 107లో రైతులు సాగుచేసుకుంటున్న లావణి పట్టా భూములపై గత ప్రభుత్వ పెద్దల కన్ను పడింది. దీంతో గ్రామంలోని ప్రజా ప్రతినిధుల ద్వారా రైతులను మభ్యపెట్టారు. చందన్‌వెల్లి తరహాలో ప్రభుత్వం త్వరలో లావణి, అసైన్డ్ భూములు తీసుకుంటుందని.. సర్కార్ తీసుకోకముందే అమ్ముకుంటే డబ్బులు వస్తాయని రైతులకు ఆశచూపారు. తక్కువ ధరకు లావణి పట్టా భూములను కొనుగోలు చేశారు.

ధరణి లొసుగులతో..

లావణి పట్టా భూములను మొదట అగ్రిమెంట్ చేసుకున్న బడాబాబులు ధరణి పోర్టల్‌లోని లొసుగులను అవకాశంగా మలుచుకున్నారు. టీఎం 33 కింద రైతులతో దరఖాస్తు చేయించి లావణి పట్టా భూములను పట్టా భూములుగా మార్చుకున్నారు. ఆ తరువాత ఆరు నెలల క్రితం ధరణిలో స్లాట్ బుక్ చేసుకుని శ్రీ భవాని డ్రీమ్ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రస్తుతం అందులో నిర్మాణ పనులు మొదలు పెట్టారు. ఈ మొత్తం వ్యవహారం వెనక గత ప్రభుత్వ పెద్దలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పెద్దల సూచనలతోనే అప్పటి అధికారులు ఈ వ్యవహారాన్ని నడిపించినట్లు సమాచారం. ఇందులో కోట్ల రూపాయలు చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది.

తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు

తోలుకట్ట రెవెన్యూలోని సర్వేనంబర్ 85, 107లోని లావణి భూములను పట్టా భూములుగా మార్చడంపై గ్రామస్తులు సోమవారం మొయినాబాద్ తహసీల్దార్ గౌతం కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. 1954 నుంచి ప్రభుత్వ భూమిగా ఉండి పేదలకు లావణి పట్టాలు ఇచ్చిన ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా ఎలా మార్చారని ప్రశ్నించారు. రియల్ వ్యాపారులు రైతులను భయపెట్టి వారి నుంచి ప్రభుత్వ భూములు కొనుగోలు చేశారని.. గత ప్రభుత్వం అండదండలతో పట్టా భూములుగా మార్చుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. ఫిర్యాదు అందజేసినవారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాణయ్య, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి భుజంగరెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, రైతులు ఉన్నారు.



మొయినాబాద్ మండలం తోలుకట్టలో పట్టా భూమిగా మారిన లావణి భూమి

నేను రాకముందే జరిగింది

తోలుకట్ట రెవెన్యూలోని 85, 107 సర్వే నంబర్లలోని లావణి పట్టా భూములు పట్టా భూములుగా మారాయి. నేను ఇక్కడికి రాకముందే అది జరిగింది. సీసీఎల్ఏ నుంచే జరిగి ఉంటుంది. ధరణిలో ఆప్షన్‌ను ఉపయోగించి పట్టా భూమిగా మారొచ్చు.

– గౌతమ్‌కుమార్, తహసీల్దార్, మొయినాబాద్



యాచారం తహసీల్దార్ అయ్యప్పతో చర్చిస్తున్న ముదిరెడ్డి కోదండరెడ్డి, సునీల్ తదితరులు

ధరణితో భూ కుంభకోణం

- స్పెషల్ డ్రైవ్‌పై రైతుల్లో హర్షం
- విడతల వారీగా భూ సమస్యలన్నీ పరిష్కారం
- ధరణి కమిటీ సభ్యులు కోదండరెడ్డి, సునీల్‌కుమార్

యాచారం: కేసీఆర్ సర్కార్ తెచ్చిన ధరణి పోర్టల్‌తో రాష్ట్రంలో భూ కుంభకోణం పుట్టుకొచ్చిందని.. భూ రికార్డులు తారుమారు చేయడంతో రూ. వేలాది కోట్ల ఆక్రమణ జరిగిందని ధరణి కమిటీ సభ్యుడు ముదిరెడ్డి కోదండరెడ్డి ఆరోపించారు. ధరణి స్పెషల్‌డ్రైవ్ ద్వారా భూ సమస్యలు ఎలా పరిష్కరమవుతున్నాయో అధ్యయనం చేసేందుకు సోమవారం మరో కమిటీ సభ్యుడు సునీల్‌కుమార్‌తో కలిసి యాచారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు.భూ సమస్యల పరిష్కారం, ఫిర్యాదులు, దరఖాస్తులపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ధరణి స్పెషల్‌డ్రైవ్ ద్వారా సమస్యలు ఎలా పరిష్కరిస్తున్నారో తహసీల్దార్ అయ్యప్పతో కలిసి చర్చించారు. అనంతరం విలేకరుల సమావేశంలో కోదండరెడ్డి మాట్లాడుతూ.. ధరణి పోర్టల్‌తో భూ రికార్డులు తారుమారైనట్లు ఫిర్యాదులు అందాయని.. వివరాలు రాగానే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. నయీం తరహా కంటే పెద్ద భూ కుంభకోణమే జరిగినట్లు ఆరోపించారు. ధరణి స్పెషల్‌డ్రైవ్ ద్వారా రైతుల భూ సమస్యలన్నీ పరిష్కరిస్తామని తెలిపారు. సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చట్టం తెస్తామని చెప్పారు. సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెండు లక్షల 45 వేల భూ సమస్యల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌తో తమ సమస్యలు పరిష్కారమవుతాయన్న భరోసా రైతుల్లో కనిపిస్తోందన్నారు. భూ సమస్యలన్నీ పరిష్కరించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

హై అలర్ట్

- నగరంలో ప్రధాని మోదీ
- నేడు ఉజ్జయిని మహంకాళీ ఆలయం సందర్శన
- రాజ్‌భవన్, సికింద్రాబాద్ పరిసరాల్లో భద్రత కట్టుదిట్టం

సాక్షి, సిటీబ్యూరో: ప్రధాని మోదీ రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం ఆదిలాబాద్ జిల్లా నుంచి నేరుగా రాజ్‌భవన్‌కు చేరుకుని రాత్రికి ఇక్కడే బస చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఆయన సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారిని దర్శించుకోనున్నారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. మోదీతో పాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మరో ఐదుగురు ఆలయ సిబ్బందిని మాత్రమే లోనికి అనుమతించనున్నారు. ఈ సమయంలో సాధారణ భక్తులెవరినీ లోనికి అనుమతించబోరు. పది నిమిషాల పాటు ఆయన ఆలయంలోనే ఉండి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ఆలయానికి వచ్చే ప్రధాన రహదారులపై ఆంక్షలు విధించనున్నారు. ఆయా మార్గాల్లో వచ్చి వెళ్లే వాహనాలను ఇతర మార్గాలకు మళ్లించనున్నారు. దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, కలెక్టర్ అనుదీప్ కుమార్, పోలీసులు ఆలయానికి చేరుకుని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పట్టుబడ్డ పందెం రాయుళ్లు



పోలీసులకు పట్టుబడ్డ పందెం రాయుళ్లు

- ఫాంహౌస్‌లో కోడి పందేలు
- ఎస్ఓటీ పోలీసుల దాడి
- 12 మంది అరెస్టు

మొయినాబాద్: ఫాంహౌస్‌లో కోడి పందేలు నిర్వహిస్తుండగా పక్కా సమాచారంతో ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి 12 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద ఉన్న మూడు కార్లు, ఆరు కోడి పుంజులు, 12 సెల్‌ఫోన్లు, రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సురంగల్ గ్రామ శివారుల్లో ఉన్న కృష్ణారెడ్డి మాన్‌సో గార్డెన్ ఫాంహౌస్‌లో సోమవారం నగరంలోని జూబ్లీహిల్స్‌లో ఉండే ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ ప్రాంతానికి చెందిన డెంకని శ్రీనివాస్ కోడి పందేలు నిర్వహిస్తున్నాడు. పక్కా సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు ఫాంహౌస్‌పై దాడి చేశారు. కోడి పందేలు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌తోపాటు కోడి పందేలు ఆడేందుకు వచ్చిన మణికొండలో ఉంటున్న విజయవాడకు చెందిన యార్లగడ్డ శ్రీచరణ్, మేడ్చల్ జిల్లా శామీర్‌పేట్‌కు చెందిన బనావత్ వసంత్‌నాయక్, గౌలిదొడ్డిలో ఉంటున్న తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఇల్ల అంజి, కూకట్‌పల్లిలో ఉంటున్న ఒంగోలు జిల్లాకు చెందిన తన్నీరు మధు, గోపన్‌పల్లిలో ఉంటున్న ఒంగోలు జిల్లాకు చెందిన కుంచల మాధవరావు, కూకట్‌పల్లికి చెందిన తన్నీరు నరేంద్ర, తెల్లాపూర్‌లో ఉంటున్న ప్రకాశం జిల్లాకు చెందిన తన్నీరు శివ, బాచుపల్లిలో ఉంటున్న కృష్ణాజిల్లాకు చెందిన తాటినేని సాయిప్రసాద్, గౌలిదొడ్డిలో ఉంటున్న సూర్యాపేట జిల్లాకు చెందిన కొడెదల హరీశ్, గౌలిదొడ్డికి చెందిన సానెబోయిన హనుమంతు, మాట్ల వివేకానందను పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న మూడు చనిపోయిన కోడి పుంజులు, మూడు బతికున్న కోడిపుంజులు, 34 కోడి కాళ్లకు కట్టే కత్తులు, 12 సెల్‌ఫోన్లు, 3 కార్లు, రూ.1,01,470 నగదు స్వాధీనం చేసుకున్నారు. పందెం రాయుళ్లను అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





'సంస్కృతీ' సౌరభం

పీపుల్స్ ప్లాజా వేదికగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సంస్కృతి మహోత్సవాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన 600 మంది కళాకారులు అద్భుత ప్రదర్శనలతో అలరించారు. సోమవారం సాయంత్రం నిర్వహించిన సంప్రదాయ నృత్య ప్రదర్శనలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హాజరై తిలకించారు. సాగర తీరంలో సాయంత్రం వేళ నిర్వహించిన ఈ సంప్రదాయ నృత్యాలు వీక్షకులను అబ్బురపరిచాయి.

– ఖైరతాబాద్

'కారు'లో కుదుపు

- ఒక్కొక్కరుగా బీఆర్ఎస్ పార్టీ వీడుతున్న నేతలు
- మొన్న మాజీ ఎమ్మెల్యే తీగల, రంగారెడ్డి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్లు
- తాజాగా బండ్లగూడ జాగీర్ మేయర్ సహా మరో ముగ్గురు కార్పొరేటర్లు!
- 'హస్తం' గూటికి చేరుతున్న నాయకులు
- చేవెళ్ల లోక్‌సభ పరిధిలో పట్టు బిగిస్తున్న కాంగ్రెస్



సీఎం రేవంత్‌ను కలిసిన బండ్లగూడ మేయర్, కార్పొరేటర్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు షాక్ మీద షాక్ తగులుతోంది. ఇప్పటికే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, సహా మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌లు ఆ పార్టీని వీడి అధికార కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సహా మరో ముగ్గురు కార్పొరేటర్లు ఆ పార్టీ అధిష్టానానికి షాక్ ఇచ్చారు. వీరంతా సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, తర్వాత కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షిని కలిశారు. ఇప్పటికే ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సైతం సీఎంను కలవడం చర్చనీయాంశమైంది. మర్యాదపూర్వంగానే తాము సీఎంను కలిసినట్లు చెబుతుండటం విశేషం. ఈ హఠాత్ పరిణామంతో ఇప్పటికే మేయర్‌పై అవిశ్వాసాన్ని ప్రకటించిన డిప్యూటీ మేయర్ వర్గం డైలమాలో పడిపోయింది.

చేవెళ్ల పరిధిలో మారుతున్న పరిణామాలు

చేవెళ్ల లోక్‌సభస్థానం పరిధిలో వికారాబాద్, పరిగి, తాండూరు, చేవెళ్ల, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో వికారాబాద్, పరిగి, తాండూరు మినహా మిగిలిన అన్ని స్థానాల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లతో పోలిస్తే ఆపార్టీకి 80 వేలకుపైగా అధికంగా ఓట్లు వచ్చాయి. సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డే మళ్లీ ఇక్కడి నుంచి పోటీ చేయనున్నట్లు బీఆర్ఎస్ అధిష్టానం ప్రకటించింది. అభ్యర్థి పేరు ప్రకటన తర్వాత ఈ నియోజకవర్గం పరిధిలో అనేక రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. అప్పటికే ఈ ఎంపీ స్థానాన్ని ఆశిస్తున్న పట్నం కుటుంబం బీఆర్ఎస్‌ను వీడి, హస్తం గూటికి చేరుకుంది. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పట్నం సునితారెడ్డి ఇక్కడి నుంచి పోటీ చేయనున్నారనే సంకేతాలను ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలుపొందాలనే ఆలోచనతో అప్పటి వరకు బీఆర్ఎస్‌తో తమ వెంట ఉన్న కేడర్‌ను సైతం కాంగ్రెస్‌లోకి తీసుకొచ్చారు. మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి సహా ఆయన కోడలు జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డిని కూడా పార్టీలోకి చేర్పించి సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ లోక్‌సభా స్థానం పరిధిలోని కీలక నేతలంతా ఒకరి తర్వాత మరొకరు వరుసగా పార్టీని వీడుతుండటం బీఆర్ఎస్ అధిష్టానానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఈ లోక్‌సభ స్థానం నుంచి మళ్లీ పోటీ చేయడం కంటే.. ఇందుకు దూరంగా ఉండటమే ఉత్తమమనే ఆలోచనలో ఆయన ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. పోటీకి అంగీకరించడం లేదనే ప్రచారం కూడా జరుగుతోంది. సిట్టింగ్ ఎంపీ అభ్యర్థి పోటీకి విముఖత చూపుతుండటంతో ప్రత్యామ్నాయంగా అదే సామాజిక వర్గానికి చెందిన బలమైన నేతను బరిలోకి దింపాలనే యోచనలో బీఆర్ఎస్ అధిష్టానం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది.

ఆ వర్గంలో అయోమయం

బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 22 డివిజన్లు ఉన్నాయి. గత ఎన్నికల్లో 14 బీఆర్ఎస్ కైవసం చేసుకోగా, ఎంఐఎం -1, బీజేపీ -2 గె లుపొందాయి. మరో ఐదు స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు అప్పటి అధికార బీఆర్ఎస్‌లో చేరా రు. మేయర్, డిప్యూటీ మేయర్ రెండు పదవు లు బీఆర్ఎస్సే చేజిక్కించుకుంది. ఆ తర్వాత ముగ్గురు మినహా మిగిలిన వారంతా బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు. మేయర్ల ఒంటె ద్దు పోకడలు నచ్చని కొంత మంది కార్పొరేటర్లు ఆయనపై ఇటీవల అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. కలెక్టర్ 34రోజుల గడువు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ మేయర్ కోర్టును ఆశ్రయించగా కోర్టు స్టే విధించింది. నిజానికి డిప్యూటీ మే యర్ వర్గమే ముందు పార్టీ వీడనుందనే ప్రచా రం జరిగింది. ఆ మేరకు కాంగ్రెస్‌తో టచ్‌లోకి వెళ్లినట్లు సమాచారం. అనూహ్యంగా సోమవారం మేయర్ సహా మరో ముగ్గురు కార్పొరేటర్లు, కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి సైతం కారు దిగి.. హస్తం గూటికి చేరుకోవడంతో అసంతృప్తి వర్గం అయోమయంలో పడిపోయింది.

లోక్‌సభ ఎన్నికల్లో ప్రాధాన్యం ఇవ్వాలి



కార్యక్రమంలో పాల్గొన్న వైశ్య వికాస వేదిక ప్రతినిధులు

- వైశ్య వికాస వేదిక ఫౌండర్ చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్తా

హుడాకాంప్లెక్స్: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో అన్ని పార్టీలు కనీసం రెండు టికెట్లు కేటాయించాలని వైశ్య వికాస వేదిక ఫౌండర్ చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్తా డిమాండ్ చేశారు. వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో సోమవారం చంపాపేటలోని లక్ష్మీ కన్వెన్షన్‌హాల్‌లో 'పార్లమెంటు ఎన్నికలు– వైశ్యుల పాత్ర'పై చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ గుప్తా మాట్లాడుతూ.. 20 సంవత్సరాల నుంచి పార్లమెంటులో వైశ్యులకు ప్రాధాన్యత లేకపోవడం బాధాకరమన్నారు. రాజకీయపరంగా వైశ్యుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. బీఆర్ఎస్ ఉద్యమకారునికి మల్కాజిగిరి టికెట్ కేటాయిస్తే వైశ్యులందరూ ఆ పార్టీ వెంట నడిచి అభ్యర్థిని గెలిపించేందుకు శాయాశక్తుల కృషి చేస్తామని ఏకగ్రీవ తీర్మానం చేశారు. 2014, 2018, 2023లో కాంగ్రెస్ పార్టీ ఒక ఎమ్మెల్యే గాని ఒక ఎంపీ గాని కేటాయించలేదని గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ కూడా ఎన్నికల్లో కనీసం రెండు సీట్లు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైశ్య వికాస వేదిక సభ్యులు నంగునూరి రమేష్, రామ్‌నరేష్, కాచం సాయి, కాచం సుష్మ, కోడుమూరి దయాకర్, బిల్దే శ్రీధర్, బచ్చు శ్రీనివాస్, గార్లపాటి జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి 'తీన్మార్'



జంగయ్య

తలకొండపల్లి: పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూనే పంతం నెగ్గించుకున్నాడు. లక్ష్య సాధనకు శ్రమించి ఏక కాలంలో మూడు కొలువులు సాధించాడు. మండల పరిధిలోని లింగరావుపల్లిలో నిరుపేద కుటుంబానికి చెందిన టీకూరి జంగయ్య. ఈయన 2019 నుంచి వీరన్నపల్లి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల ప్రభుత్వం వెల్లడించిన గురుకుల ఫలితాల్లో డిగ్రీ, జూనియర్ లెక్చరర్‌తో పాటుగా పీజీటీ(పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్) ఉద్యోగాలకు ఎంపికై ఔరా అనిపించాడు. కూలీ పనులు చేస్తూ కష్టపడి చదివించిన తల్లిదండ్రులు లక్ష్మమ్మ, చంద్రయ్య ఆశయాలను నిలబెట్టి నిరుద్యోగ యువతకు ఆదర్శంగా నిలిచాడు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి



ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో అనితారెడ్డి, టీకేఆర్



ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డితో..

మహేశ్వరం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిలను జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి సోమవారం నగరంలోని వారి నివాసాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. మెజార్టీ ఎంపీ సీట్లను కాంగ్రెస్ కై వసం చేసుకుంటుందన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ నేతలను సమన్వయం చేసుకుంటూ ఓట్లు భారీగా రాబట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బేర బాలకిషన్, ఆకుల అరవింద్ కుమార్, సరికొండ మల్లేశ్, చప్పిడి సంతోశ్‌రెడ్డి, నాగేందర్ గౌడ్, సదానంద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: మున్సిపల్ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెప్పారు. పట్టణానికి చెందిన పలువురు చిరు వ్యాపారులు సోమవారం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో కసిరెడ్డిని కలిశారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరారు. రోడ్డు విస్తరణతో ఉపాధి కోల్పోయామని షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఉపాధి చూపుతామని హామీ ఇచ్చినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే పట్టణాభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా పనిచేస్తానన్నారు. రోడ్డు విస్తరణతో ఉపాధి కోల్పోయిన చిరు వ్యాపారుల సమస్యలను పరిష్కరిస్తానన్నారు. గతంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి తానే కృషి చేశానని గుర్తు చేశారు. మీ ఇబ్బందులను వీలైనంత త్వరగా పరిష్కరించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

నేడు రాజేంద్రనగర్ సర్కిల్ జర్నలిస్టులకు క్రికెట్ పోటీలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా జర్నలిస్టుల ఆధ్వర్యంలో మంగళవారం క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు జర్నలిస్టుల ప్రతినిధులు దామోదర్‌రెడ్డి, భీమయ్య, భుజంగారెడ్డి, ఆంజనేయులు, బాల సుబ్రమణ్యం తెలిపారు. శివరాంపల్లిలోని ఓ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. విజయానంద్ గార్డెన్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూడు మ్యాచులు ఏర్పాటు చేశామని తెలిపారు. 78 మంది నాలుగు జట్లుగా పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు సాయంత్రం బహుమతులను అందజేస్తామన్నారు. జర్నలిస్టులతో పాటు వారి కుటుంబ సభ్యులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మహిళలకు, పిల్లలకు మ్యూజిక్ చైర్, లెమన్ స్పూన్ తదితర పోటీలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రానికి ఐఐహెచ్‌టీపై హర్షం



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న చేనేత నాయకులు

పహాడీషరీఫ్: కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రాష్ట్రానికి జాతీయ చేనేత సాంకేతిక సంస్థ (ఐఐహెచ్‌టీ) మంజూరు చేయించిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. చేనేత విభాగం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మస్న రవికుమార్, పున్న రామలింగం, పీర్ల పురుషోత్తం, అంకం శ్రీనివాస్, వరలక్ష్మి, సత్యసాయి తదితర నేతలు గాంధీభవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. ఐఐహెచ్‌టీ(ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ) మంజూరు చేయడం ద్వారా రాష్ట్ర విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లే పరిస్థితి తప్పుతుందన్నారు. మన రాష్ట్రంలోనే టెక్స్‌టైల్ టెక్నాలజీ రంగానికి సంబంధించిన కోర్సులను చదవడానికి వీలుంటుందన్నారు.

PUBLIC NOTICE

Andhra Pradesh Association of the Deaf (Model School for Deaf)
Pedda Amberpet, Hayathnagar, Abdullapurmet, R.R. District
(Registration No. 442/70)

It is resolved in the APAD General Body meeting held on 2nd October 2023 that the following members are expelled from the society as follows: "Expulsion of members involved in the Civil and Criminal cases by involving illegal sales of the society land and therefore the following members are expelled from the membership 1) Mr. S. Jeethandranath Shatkar S/o Shiva Rao Occupation: Business, 2) Mr. B. Omprakash Yadav S/o Pentaiah Occupation: Taken VRS from Ordnance factory, 3) Mr. Chand Pasha S/o Shaik Mahaboob Occupation: working at DRDL, 4) Mr. Shaik Abdul Gaffar S/o Shaik Abdul Razzak Occupation: working at Nehru Zoological Park, 5) Mr. Syed Mazharuddin S/o late Fakruddin Occupation: working at Ordnance factory, 6) Mr. Munner Ahmed S/o Shaik Ahmed Occupation: Working for Air India and 7) Mr. P. Srinivas Rao S/o late Bhaskar Rao Occupation: Retired employee of BDL of Andhra Pradesh Association of the Deaf Model school for the deaf vide Registration No. 442/70 situated at Pedda Amberpet, Hayathnagar, Abdullapurmet, Ranga Reddy District Telangana".

Anybody dealing any transactions with these expelled members shall be doing at their own risk and costs the society does not take responsibility whatsoever in any manner in the past, present and future. All the illegal transactions with regard to the land of the Society done by the aforesaid members stand cancelled. Everyone is cautioned not to enter into any dealings with regards to the society land and other manners. The society reserves the right file cases against the offenders if found. Anybody trespassing into the society land in the survey Nos. 230, 231, 232 and 233 Pedda Amberpet, Hayathnagar, Abdullapurmet, Ranga Reddy District shall be prosecuted.

T.Niranjan Prasad,
B.Com(Hons), MBA,LLB, Advocate
PRASAD & ASSOCIATES,
Advocates, Solicitors & Legal Consultants
Off: Plot No: 8, Thalluri Complex, Sree Colony,R.K.Puram(post), Secunderabad 500 056(A.P) Email: adv.tnprasad@gmail.com, Ph: 90002 04288, 89778 53307

తండ్రి మందలించాడని..

యువకుడి అదృశ్యం



షేక్ అలీ (ఫైల్)

పహాడీషరీఫ్: తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ ఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పహాడీషరీఫ్ ఉమర్ కాలనీకి చెందిన షేక్ అహ్మద్ కుమారుడు షేక్ అలీ(18) స్థానికంగా కార్ మెకానిక్ దుకాణంలో పని చేస్తున్నాడు. వ్యసనాలకు బానిసవుతుండడంతో ఈ నెల 2న తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన అలీ అదేరోజు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో సాధ్యమైన అన్నిప్రాంతాల్లో వెతికాడు. ఫలితం లేకపోవడంతో ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలన్నారు.

బఫర్‌జోన్‌లో ప్రహరీ కూల్చివేత



ప్రహరీని తొలగిస్తున్న సిబ్బంది

మణికొండ: చెరువు బఫర్ జోన్‌లో నిర్మించిన ప్రహరీని రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేశారు. గతంలో మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ చెరువు బఫర్ జోన్‌లో నిర్మించిన విల్లాలను తొలగించి ప్రాజెక్టు చుట్టూ నిర్మించిన ప్రహరీని అలాగే వదిలేశారు. ప్రస్తుతం కలెక్టర్‌కు ఫిర్యాదు వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు సోమవారం ప్రహరీని పూర్తిగా తొలగించారు. కార్యక్రమంలో ఆర్ఐ విక్రంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానం.. పెనుభూతమై..

- భార్యను చంపిన భర్త
- నిందితుడి అరెస్టు

మైలార్‌దేవ్‌పల్లి: భార్యపై అనుమానంతో భర్త ఆమె తలపై బండరాయితో మోది దారుణంగా హత్య చేసిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి ఠాణా పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ మధు తెలిపిన ప్రకారం.. చత్తీస్‌గడ్ రాష్ట్రానికి చెందిన అమిత్ సాహు, మధుబాయి(29) దంపతులు ఏడాది నుంచి రాజేంద్రనగర్ సర్కిల్ శాస్త్రీపురం డివిజన్‌లో నిర్మాణంలో ఉన్న భవనంలో నివాసం ఉంటూ కూలీలుగా పని చేస్తున్నారు. మధుబాయి కార్మికులతో చనువుగా ఉంటుండటంతో అమిత్ ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. ఆదివారం రాత్రి ఆమె నిద్రిస్తుండగా బండరాయితో మోదడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారంతో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో : 2024-25 విద్యా సంవత్సరానికి గాను వాటర్ స్పోర్ట్స్ అకాడమీ బోయిన్‌పల్లిలో ఐదవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఎస్ సంధ్యారాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి లో ప్రవేశానికి గాను బాల బాలికల ఎత్తు బరువు స్టాండింగ్ బ్రాడ్ జంప్, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్ త్రో 30 మీటర్లు ఫ్లయింగ్ స్టార్ట్ ఫ్లెక్సిబిలిటీ టెస్ట్ 800 మీటర్ల పరుగు పందెం పోటీల ప్రతిభా ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల గిరిజన బాల బాలికలు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, బోనఫైడ్ ఆధార్ జిరాక్స్ సర్టిఫికెట్లతో జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయం 4వ అంతస్తు కలెక్టర్ కాంప్లెక్స్ హైదరాబాద్‌లో నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం ఫోన్ నెంబర్ 8374909268, 9553554455 ను సంప్రదించాలని సూచించారు.

అత్తాపూర్ ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

అత్తాపూర్: అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్‌గా జి.వెంకటరామిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాజేంద్రనగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. అదేవిధంగా ఇంతకు ముందు ఎస్ఐ పులి యాదగిరి స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. ఫ్రెండ్లీ వ్యవస్థ పనితీరుకు అనుగుణంగా పని చేస్తూ తన దృష్టికి వచ్చిన సమస్యలను పక్షపాత ధోరణి లేకుండా పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

బిల్డింగ్ పైనుంచి పడి వృద్ధురాలి మృతి

రాజేంద్రనగర్: బిల్డింగ్ పై నుంచి పడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భవానీకాలనీకి చెందిన నితీశ్ తన కుటుంబ సభ్యులతో పాటు, తల్లి శారదాదేవి (70)తో కలిసి నివసిస్తున్నాడు. అపార్ట్‌మెంట్ నాలుగో అంతస్తులో వీరు ఉంటున్నారు. ఉదయం శారదాదేవి బాల్కనీలో బట్టలు ఆరేస్తూ ప్రమాదవ శాత్తు పై నుండి కింద పడింది.ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వర్టికల్ గార్డెన్స్‌పై విద్యార్థులకు శిక్షణ



వర్టికల్ గార్డెన్స్‌పై శిక్షణకు హాజరైన బాలికలు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో సబ్‌ప్లాన్‌లో భాగంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు జీవనోపాధికి అవసరమైన వర్టికల్ గార్డెన్స్‌లో నైపుణ్యాభివృద్ధిపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా అందమైన అలంకరణ మొక్కలతో వర్టికల్ గార్డెన్స్ ఏర్పాటు , సరైనా యాజమాన్య పద్ధతులను పాటించాల్సిన మెళకువలను వివరించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు వర్టికల్ గార్డెనింగ్‌పై నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుంటే సుస్థిరమైన ఆర్థిక ప్రగతితో పాటు పది మందికి జీవనోపాధిని చూపించగలుగుతారన్నారు. ముఖ్యంగా నూతనంగా నిర్మిస్తున్న ఫ్లైఓవర్స్, రహదారుల కిరువైపులా ఎంతో అందంగా వర్టికల్ గార్డెన్ ఏర్పాటు చేస్తున్నారని, దానివలన పచ్చదనంతో పాటు స్వచ్ఛమైన గాలి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ వర్టికల్ గార్డెన్స్‌ను ఇంటి లోపల బయట ఆవరణలోని గోడలకు వివిధ అందమైన అలంకరణ మొక్కలతో అలంకరించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌చార్జి అసిస్టెంట్ ప్రొఫెసర్ మమత, కళాధర్‌బాబు, నాగహర్షిత, నిరోషా, సంతోషిని, శ్రీనివాస్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువు పనులు పూర్తి చేయిస్తాం

మణికొండ: నెక్నాంపూర్ చెరువు అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తానని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్ అన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌తో కలిసి చెరువు పరిసరాల్లో గుర్రపు డెక్క తొలగింపు పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ. చెరువు సుందరీకరణ, బోటింగ్, గ్రీన రీ లాంటి సౌకర్యాలను కల్పించాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం రూ. 22 కోట్లతో ఏడేళ్ల క్రితం పనులు చేపట్టినా ఇప్పటివరకు సగం కూడా పూర్తి కాలేదన్నారు. ఈ విషయాన్ని ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తి చేసేందుకు అవసరమగు నిధులను విడుదల చేయిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ దుర్మరణం



కునాల్(ఫైల్)

మణికొండ: రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ దుర్మరణం పాలైన సంఘటన సోమవారం నార్సింగి పోలీస్‌స్టేషన్ సమీపంలో ఔటర్‌రింగ్ రోడ్డుపై చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన కునాల్ (23)లంగర్ హౌస్‌లోని మిలిట్రీ రిజిమెంట్‌లో సపాయి అథ్లెట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం ఉదయం అతను బ్యాంక్‌కు వెళుతున్నట్లు చెప్పి రెజిమెంట్‌లో నుంచి బయటికి వచ్చాడు. మధ్యాహ్నం ఔటర్‌రింగ్ రోడ్డు వైపు వచ్చిన అతను రోడ్డు దాటుతుండగా గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపు వెళుతున్న రెడీమిక్స్ వాహనం అతడిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఆర్మీ అధికారులు మృతుడిని తమ క్యాంప్‌లోనే ఉంటున్న కునాల్‌గా గుర్తించారు. అతను క్యాంప్ నుంచి నార్సింగిలోని ఎస్‌బీఐ బ్యాంక్‌కు వచ్చి ఔటర్‌రింగ్ రోడ్డు పైకి ఎందుకు వచ్చాడనే విషయమై దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు పోలీసులు సీసీ టీవీల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఆర్మీ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వల పన్ని.. వంచించి...

స్నేహం పేరుతో యువతులతో పరిచయం పెంచుకోవడం.. ఆపై వారిని వేధించడం. తరచూ ఇలాంటి ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా ఎల్‌బీనగర్, సైదాబాద్‌లోనూ ఇదే జరిగింది. ఇద్దరు స్నేహితులు ఓ యువతిపై లైంగిక దాడికి పాల్పడటమే కాకుండా ఆమె నగ్న చిత్రాలు రికార్డు చేసి వేధించారు. మరోవైపు సైదాబాద్‌లో ఓ బాలికను వేధించాడో యువకుడు. వీరిపై కేసులు నమోదు చేశారు పోలీసులు.

- యువతిపై సామూహిక లైంగికదాడి
- ఎల్‌బీనగర్‌లోని ఓ లాడ్జిలో ఘటన
- మరో చోట బాలికకు వేధింపులు.. పోక్సో కేసు నమోదు

నాగోలు: డిగ్రీ చదివే యువతికి ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైన యువకుడు.. ఆమెపై అత్యాచారం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సదరు యువకుడు బెదిరింపులకు పాల్పడంతో బాధిత యువతి బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బోరబండ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ బదిలీ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఓ యువతి(19) గతంలో ఎల్‌బీనగర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఉండేది. రామంతపూర్‌లోని ఓ డిగ్రీ కాలేజీలో చదివే సమయంలో అదే ప్రాంతానికి చెందిన ఆదిత్య(19)తో ఇన్‌స్టాగామ్ ద్వారా పరిచయం ఏర్పడింది. దీంతో అతను యువతి కళాశాల వద్దకు తరచూ కలిసేవాడు. అదే ఏడాది ఏప్రిల్ 3న కాలేజీ వద్దకు వెళ్లిన అతను సదరు యువతిని ఇంటి వద్ద బైక్‌పై డ్రాప్ చేస్తానని చెప్పి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో దగ్గర దారిలో ఇంటికి తీసుకెళ్తానని చెప్పి.. ఎల్‌బీనగర్ కామినేని చౌరస్తాలో మారుతి రెసిడెన్సీ లాడ్జికి తీసుకెళ్లాడు. ఆపై మత్తు మందు కలిపిన మంచినీళ్లు ఇచ్చి స్పృహ కోల్పోయేలా చేశాడు. ఆ తర్వాత అక్కడికి వచ్చిన తన స్నేహితుడు ప్రణవ్‌తో కలిసి ఆదిత్య ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో భయపడిన యువతి ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. అయితే, రెండు నెలల క్రితం యువతి కుటుంబం బోరబండ, కల్యాణ్‌నగర్‌కు మకాం మార్చింది. ఈ క్రమంలో ఆమె స్థానికంగా ఓ మార్ట్‌లో క్యాషియర్‌గా పని చేస్తోంది. ఈ ఏడాది జనవరిలో ఆమె పని చేస్తున్న మార్ట్ వద్దకు వచ్చిన ఆదిత్య తాను చెప్పిన చోటుకు రావాలంటూ వేధింపులకు పాల్పడ్డాడు. అంతేకాకుండా ప్రణవ్‌తో కలిసి తరచూ ఆమెకు ఫోన్ చేస్తూ బెదిరిస్తున్నారు. తాము చెప్పినట్లు వినకుంటే తమ దగ్గరున్న నగ్న చిత్రాలు బయట పెడతామంటూ వేధించారు. దీంతో బాధితురాలు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పడంతో పాటు ఆదివారం బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. కేసును ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

వేధించి..డబ్బుల కోసం బెదిరిస్తూ..

సైదాబాద్: బాలికను శారీరకంగా వేధించడంతో పాటు ఆమె నగ్న చిత్రాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి డబ్బులు, బంగారం ఇవ్వాలని బెదిరిస్తున్న యువకుడిపై సైదాబాద్ ఠాణాలో పోక్సో సెక్షన్ కింద కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. సైదాబాద్‌కు చెందిన ఓ వ్యాపారికి ముగ్గురు కుమార్తెలు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న చిన్న కూతురు(17)తో కలిసి తల్లి నెల రోజుల క్రితం బోయినపల్లిలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లింది. అక్కడ సుమైర్ అనే యువకుడి ఫోన్ నంబర్ ఇవ్వాలని బాలిక వెంటబడ్డాడు. ఆమె నంబర్ ఇవ్వకుండా అక్కడి నుంచి తప్పించుకుంది. అయితే, ఆమె ఫోన్ నంబర్, సోషల్ మీడియా ఐడీ తెలుసుకున్న సుమైర్.. బాలికతో ఫోన్, చాటింగ్ చేస్తూ పరిచయం పెంచుకున్నాడు. ఈ నెల 1న రాత్రి ఆమె ఇంట్లోకి వచ్చి ఆమెతో అసభ్యంగా ప్రవర్తిస్తూ శారీరకంగా వేధించడమేగాక తన ఫోన్‌లో రికార్డ్ చేశాడు. మరుసటి రోజు బాలికకు ఫోన్ చేసి బెదిరింపులకు దిగాడు. తనకు డబ్బులు, బంగారం ఇవ్వకపోతే ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. అయితే, ఇంట్లో బాలిక ప్రవర్తన సరిగా లేకపోవడాన్ని గుర్తించిన తల్లిదండ్రులు ఆమెను నిలదీయగా అసలు విషయం బయటపడింది. ఆదివారం బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.